సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



భవనాలు పూర్తయ్యేనా!
రామన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న పంచాయతీ భవనాల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.
- 9లో

న్యూస్‌రీల్

సోమవారం ప్రజావాణి రద్దు

భువనగిరి టౌన్ : మిలాద్-ఉన్-నబి పండుగ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఈనెల 16వ తేదీన జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ కార్యాలయం అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రోజు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందని, ప్రజలు గమనించి ప్రజావాణికి రావద్దని కోరారు. తిరిగి 23వ తేదీ నుంచి యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

వ్యాయామం, యోగాతో ఒత్తిడి దూరం

బొమ్మలరామారం : యోగా, వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడిని జయించవచ్చని బొమ్మలరామారం మండల వైద్యాధికారి సుమలత తెలిపారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల్లో భాగంగా శనివారం బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందే చిట్కాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సమయానికి హోంవర్క్ పూర్తి చేయాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమయం గడపడంతో పాటు విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడడం వల్ల కుటుంబాలకు తీరనిక్షోభ మిగులుతుందని, ఎంతటి సమస్య వచ్చినా ఆత్మస్థైర్యంతో అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రచన, కేజీవీబీ ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గతంకంటే సభ్యత్వం పెంచాలి



మాట్లాడుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జి అభయ్ పటేల్

భువనగిరి : గతకంటే సభ్యత్వ నమోదును పెంచాలని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జి అభయ్ పటేల్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ స్థాయి సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బూత్ స్థాయిలో సభ్యత్వ నమోదును పెంచేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలని, అందుకోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర సభ్యత్వ ప్రముఖ్ రామచందర్‌రావు, జిల్లా సభ్యత్వ ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర నాయకులు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, గూడూరు నారాయణరెడ్డి, ధర్మారావు, పడాల శ్రీనివాస్, మొగులయ్య, రాచకొండ కృష్ణ, సుర్వి లావణ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్‌గుప్తా, అశోక్, భువనగిరి పట్టణ కమిటీ అధ్యక్షుడు రత్నపురం బలరాం తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పథకంపై ప్రభుత్వం మాట తప్పింది

భువనగిరిటౌన్ : గొర్రెల పంపిణీ పథకం కొనసాగిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని గొర్రెల,మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు విమర్శించారు. శనివారం భువనగిరిలో ఏర్పాటు చేసిన గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెలు పంపిణీ చేయకుండా డీడీలు వాపస్ ఇవ్వడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. రెండో విడతలో భాగంగా జిల్లాలో 3,134 మంది లబ్ధిదారులు రూ.43,750 చొప్పున కలెక్టర్ ఖాతాలో తమ వాటాధనం జమ చేశారని, అందులో కేవలం 2,790 యూనిట్లు మాత్రమే పంపిణీ చేశారని పేర్కొన్నారు. మిగిలిన 347 మందిలో 236 మంది డీడీలు వాపస్ తీసుకున్నారని తెలిపారు. పథకంపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.అదే విధంగా ప్రమాదాల్లో చనిపోయిన పెంపకందారులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఉచిత గొర్రెల బీమా పథకం అమలు చేయాలని, 50 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ, ఉపాధ్యక్షుడు మద్దెపురం బాలనర్సింహ, సహాయ కార్యదర్శి ఎల్లంల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఏకాదశి పూజలు



ఉత్సవమూర్తులకు పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి వేద పండితుల మంత్రోచ్ఛరణలు, సన్నాయి మేళం మధ్య లక్ష పుష్పార్చన చేపట్టారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ప్రధానాలయ ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవోత్సవం తదితర పూజా కైంకర్యాలు గావించారు.

నేడు కేటీఆర్, హరీష్‌రావు రాక

- జిట్టా బాలకృష్ణారెడ్డి దశదినకర్మకు హాజరు

భువనగిరి : తెలంగాణ మలిదశ ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి దశదిన కర్మ ఆదివారం భువనగిరి పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హాజరు కానున్నట్లు భువనగిరి బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు జనగాం పాండు ఒక ప్రకటనలో తెలిపారు.

మేం చూసుకుంటాం!

అక్రమ నిర్మాణదారులకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల అండదండలు



ఇక్కడ కనిపిస్తున్నది భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని హుసేనాబాద్ వద్ద ఉన్న ఇందిరమ్మ కాలనీ. ఈ కాలనీ ఏర్పడి కొన్ని సంవత్సరాలు కావస్తోంది. అయినా చాలా ఇళ్లకు ఇప్పటి వరకు నంబర్లు కేటాయించలేదు. దీనివల్ల సదరు కుటుంబాలు పన్ను చెల్లించడం లేదు.

- మున్సిపాలిటీల్లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు
- చర్యలకు వెనుకడుగు వేస్తున్న యంత్రాంగం
- కొత్త నిర్మాణాలకు నంబర్లు కేటాయించడంలో అనాసక్తి
- అనుమతి ఉన్న ఇళ్లనుంచి పన్ను వసూలు చేయడంలోనూ విఫలం
- ప్రభుత్వ ఆదాయానికి గండి

సాక్షి, యాదాద్రి : ఆదాయం పెంచుకునే అవకాశాలున్నా మున్సిపాలిటీలు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలకు అడ్డుకట్ట వేయకపోగా.. అనుమతులున్న వాటి నుంచి పన్ను వసూలు చేయడంలోనూ విఫలమవుతున్నాయి. బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులే అక్రమాలకు వంతపాడుతున్నారని, దీంతో చర్యలకు యంత్రాంగం వెనుకడుగు వేస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు

జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో రెండు మున్సిపాలిటీలు హెచ్ఎండీఏ పరిధిలో, ఒకటి వైటీడీఏ పరిధిలో ఉన్నాయి. భువనగిరి మున్సిపాలిటీలో ప్రధాన రహదారి వెంట గజం స్థలం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతుంది. 200 గజాల స్థలంలో మూడు అంతస్తుల నిర్మాణం చేపడితే అనుమతి కోసం సుమారు రూ.6 లక్షలు మున్సిపాలిటీకి చెల్లించాలి. రోజురోజుకూ పెరుగుతున్న పట్టణీకరణ వల్ల మున్సిపాలిటీల్లో ఇళ్లకు డిమాండ్ పెరిగింది. దీంతో తక్కువ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు.

1200 గజాలకు పైన హెచ్ఎండీఏ అనుమతి

హెచ్ఎండీఏ మండలాలైన చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లిలో వ్యాపార, వాణిజ్య భవనాలకు, 1200 గజాల పైబడిన నివాస భవనాలకు హెచ్ఎండీఏ అనుమతులు ఇస్తుంది. 50 నుంచి 1200 గజాల వరకు రెసిడెన్షియల్ ఇళ్ల నిర్మాణాలకు మున్సిపాలిటీలు అనుమతులు జారీ చేస్తాయి. స్థలాన్ని బట్టి నిర్మాణాలకు అనుమతి ఇస్తాయి. హెచ్ఎండీఏ అనుమతి ఇచ్చిన నిర్మాణాలకు సంబంధించి రుసుములో కొంత మొత్తం మున్సిపాలిటీకి బదిలీ అవుతుంది. కానీ, భారీ భవంతులను సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తుండడంతో మున్సిపాలిటీలు ఆదాయం కోల్పోతున్నాయి.

భువనగిరిలో అధికంగా..

భువనగిరి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డులేకుండా పోయింది. వక్ఫ్, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఇలా వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రధాన రహదారి పక్కన అనుమతి పొందకుండా కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపట్టినా అడిగే నాథుడే లేడు. కొందరు మొదటి అంతస్తుకు అనుమతి పొంది రెండు, మూడు అంతస్తులు నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. అక్రమ నిర్మాణదారులకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల అండగా ఉంటున్నారనే విమర్శలున్నాయి.

నంబర్లు లేని ఇళ్లను గుర్తిస్తున్నాం



భువనగిరి మున్సిపాలిటీలో నంబర్లు లేని ఇళ్లను గుర్తించి వాటికి నంబర్లు కేటాయిస్తున్నాం. కొత్తగా నిర్మించిన భవనాలను కూడా పరిశీలిస్తున్నాం. నిబంధనల మేరకు నిర్మాణాలు చేశారా, ఉల్లంఘించారా పరిశీలిస్తున్నాం. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చడమే ధ్యేయం. నేను వచ్చిన ఆరు నెలల కాలంలో ఆస్తిపన్ను రూ.80లక్షలు వసూలు చేశాం. పన్ను ఎగవేతదారులను కూడా గుర్తిస్తున్నాం. వారి వద్దకు ప్రత్యేక బృందాలను పంపుతాం.

–రామాంజులరెడ్డి, భువనగిరి మున్సిపల్ కమిషనర్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్కడ?

మున్సిపాలిటీల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేయడానికి ఐదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలను ఏర్పాటు చేసింది. కానీ, ఒక్క అక్రమ నిర్మాణాన్ని కూడా తొలగించలేకపోయారు.

మున్సిపాలిటీల వారీగా అసెస్‌మెంట్లు

- భువనగిరి మున్సిపాలిటీలో 14,885 నిర్మాణాలు ఉన్నాయి. ఇందులో సింగన్నగూడెం, జాతీయ రహదారి పక్కన ఉన్న ఇందిరమ్మ కాలనీలో ఇళ్లు నంబర్లు లేకుండా ఉన్నాయి. వీటితో పాటు సీతానగర్, ఇందిరానగర్, శివారు ప్రాంతాల్లో కొత్త నిర్మాణాలు జరిగినా ఇంత వరకు అసెస్‌మెంట్ చేయడం లేదు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్ వరకే అనుమతి తీసుకుని అదనంగా నిర్మించిన అంతస్తులకు పన్నులు విధించడం లేదు. వాటికి నంబర్లు కూడా వేయడం లేదు.
- మోత్కూర్ మున్సిపాలిటీలో 5,089 నిర్మాణాలు ఉన్నాయి. ఇందులో 4,921 ఇళ్లకు అధికారులు నంబర్లు ఇచ్చి పన్ను నిర్ణయించారు. ఇంకా 168 నిర్మాణాలను అసెస్మెంట్ చేయలేదు. వీటి ద్వారా మున్సిపాలిటీ ఏటా రూ.1 లక్షల ఆదాయం కోల్పోతుంది.
- చౌటుప్పల్‌లో 8,528 నిర్మాణాలు ఉండగా ఇందులో అసెస్‌మెంట్ చేయనివి సుమారు 150 నుంచి 180వరకు ఉన్నాయి. వీటి ద్వారా మున్సిపల్ ఆదాయానికి ఏటా రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు గండి పడుతోంది.
- భూదాన్‌పోచంపల్లిలో 5,115 నిర్మాణాలు ఉన్నాయి. 4,973 నిర్మాణాలకు నంబర్లు వేసి పన్ను నిర్ణయించారు. కొత్తగా నిర్మించిన 192 నిర్మాణాలకు ఇంకా ఇంకా అసెస్మెంట్ చేయలేదు. వీటి ద్వారా సుమారు రూ.6.50 లక్షల ఆదాయం కోల్పోవాల్సి వస్తుంది.
- ఆలేరులో 4,777 నిర్మాణాలకు గాను 4,327 నిర్మాణాలకు మున్సిపాలిటీ లెక్కల్లో ఉన్నాయి. సరైన డాక్యుమెంట్‌లు లేని కారణంగా ఇంకా 450 నిర్మాణాలకు నంబర్లు ఇవ్వలేదు. వీటితో పాటు కొత్తగా చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయి. వీటి ద్వారా మున్సిపాలిటీ రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతుంది.







పేమెంట్ ప్లేగ్రౌండ్స్

మిర్యాలగూడ పట్టణంలోని క్లియోస్పోర్ట్స్ మైదానం

ఆటలంటే ఇష్టపడని వారుండరు. ఇప్పుడు ఆటల కోసం ప్రత్యేకంగా ప్రైవేట్ స్టేడియాలు సైతం వెలుస్తున్నాయి. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఇండోటర్ఫ్ కోర్టులు (బాక్స్ క్రికెట్ గ్రౌండ్స్), ప్రైవేట్ అకాడమీలు, ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఏర్పాటయ్యాయి. వీటిలో సమయాన్ని బట్టి అద్దె వసూలు చేస్తున్నారు. ఇక్కడ క్రీడల్లో తర్ఫీదు సైతం ఇస్తున్నారు. అన్ని హంగులతో ఏర్పాటైన ఈ క్రీడా ప్రాంగణాల్లో సమయం దొరికినప్పుడల్లా.. చిన్న పెద్దా తారతమ్యం లేకుండా ఆటలు ఆడుతూ ఆహ్లాదం పొందుతున్నారు.

సండే స్పెషల్

- ప్రత్యేక కథనం 8లో▸

మదర్ డెయిరీ చైర్మన్‌గా 'గుడిపాటి'

- ఏకగ్రీవంగా ఎన్నిక
- అక్టోబర్ 1న బాధ్యతల స్వీకరణ



గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

సాక్షి, యాదాద్రి : మదర్ డెయిరీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక జరిగింది. మధుసూదన్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి ఎ.వెంకట్‌రెడ్డి ప్రకటించారు. కాగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా మధుసూదన్‌రెడ్డి ధ్రువీకరణపత్రం అందుకున్నారు. ప్రస్తుత చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. అక్టోబర్ 1నుంచి మధుసూదన్‌రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేసిన మధుసూదన్‌రెడ్డి

మదర్ డెయిరీ చైర్మన్ పదవికి గుడిపాటి మధుసూదన్‌రెడ్డి ఒక్కరే రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. మొదటి సెట్ అభ్యర్థిత్వాన్ని డైరెక్టర్ పుప్పాల నర్సింహులు బలపర్చగా, డైరెక్టర్ చల్లా సురేందర్ రెడ్డి ప్రతిపాదించారు. మరో సెట్‌లో శ్రీధర్‌రెడ్డి ప్రతిపాదించగా, డైరెక్టర్ మండలి జంగయ్య బలపర్చారు. నూతనంగా ఎన్నికైనవారితో కలిపి మదర్ డెయిరీలో మొత్తం 15 మంది డైరెక్టర్లు ఉన్నారు.

డ్రా ద్వారా కొత్త డైరెక్టర్ల పదవీకాలం

నూతనంగా ఎన్నికైన ఆరుగురు డైరెక్టర్ల పదవీ కాలాన్ని డ్రా పద్ధతిలో నిర్ణయించారు. మండలి జంగయ్య, పుప్పాల నర్సింహులు, కల్లెపల్లి శ్రీశైలంకు నాలుగేళ్లు, గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, అగ్రాల నర్సింహారెడ్డి, బత్తుల నరేందర్‌రెడ్డి ఐదేళ్లు పదవిలో కొనసాగనున్నారు.

ప్రముఖుల అభినందనలు

మదర్‌డెయిరీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన గుడిపాటి మధుసూదన్‌రెడ్డికి రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు. చైర్మన్ ఎన్నిక సందర్భంగా మంత్రితో పాటు ఎమ్మెల్యేలు హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయానికి చేరుకున్నారు. డైరెక్టర్లతో మాట్లాడి గుడిపాటి పేరు నిర్ణయించారు.

లాభాల బాటలో నడిపిస్తా

మదర్ డెయిరీని లాభాల బాటలోకి నడిపిస్తాను. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మదర్‌డెయిరీ పరిస్థితిని వివరించి అభివృద్ధి చేయాలని కోరుతా. చైర్మన్‌గా రైతులకు సేవ చేసేందుకు నాకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. అక్టోబర్ 1న రైతుల సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తా.

–గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్



గుడిపాటికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

న్యాయం జరిగేవరకు పోరాటం



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు బాధితులు, నాయకులు

- రీజినల్ రింగ్ రోడ్డు బాధితుల ఆందోళన

చౌటుప్పల్ : రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూములు, ప్లాట్లు, ఇళ్లు కోల్పోతున్న బాధితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లింగారెడ్డిగూడెంలో జరిగిన రీజినల్ రింగ్ రోడ్డు బాధితుల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. భూమికి భూమి ఇవ్వాలని లేదంటే బహిరంగ మార్కెట్ ధర ప్రకారంగా పరిహారం చెల్లించాలని, అప్పటి వరకు బాధితుల పక్షాన పోరాడుతామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి, సీఎం బాధితుల పక్షాన ఆలోచించాలని, జీవనాధారమైన భూములను లాక్కోవద్దని కోరారు. పరిహారంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలుస్తామన్నారు. అనంతరం జాతీయ రహదారిపై వలిగొండ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టగా పోలీసులు వారికి నచ్చజెప్పి విరమింపజేశారు. జీఎంపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు నర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, ప్రతినిధులు బోరెం నర్సిరెడ్డి, పల్లె శేఖర్‌రెడ్డి, ఆకుల ధర్మయ్య, బోయ యాదయ్య, గుండెబోయిన వెంకటేశం, గోపగోని లక్ష్మణ్, బోరెం ప్రకాష్‌రెడ్డి, సందగళ్ల మల్లేష్, బోయ యాదయ్య, మారుపాక లింగం, సుర్కంటి రాజిరెడ్డి, జాల వెంకటేష్, జంగయ్య, శ్రీశైలం, యాదయ్య, మైసయ్య, చింతల ప్రభాకర్‌రెడ్డి, తౌర్పునూరి శ్రీను, రవీందర్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, నర్సింహ, ఎల్లప్ప, అంజయ్య పాల్గొన్నారు.

17 నుంచి పశుగణన

భువనగిరిటౌన్ : జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి పశుగణన ప్రారంభించనున్నట్లు జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31వరకు నాలుగు నెలల పాటు పశుగణన కొనసాగుతుందన్నారు. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. పశుగణన సర్వేలో 117 మంది ఎన్యుమరేటర్లు, 34 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటారని, వారందరికీ ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పశువులతో పాటు దేశీయ కోళ్లు, పౌల్ట్రీ కోళ్లు, బాతులు, కుక్కలు, కుందేళ్లు, పిల్లులు, గుర్రాలు, నెమళ్లను కూడా లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. రైతులు, పశు పోషకులు సహకరించాలని కోరారు.

రైతులందరికీ రుణమాఫీ చేయండి

- వ్యవసాయ శాఖ మంత్రికి డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి



మంత్రి తుమ్మలను కలిసిన కుంభం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డీసీసీబీ పరిధిలో రుణమాఫీ కాని రైతులందరికీ మాఫీ చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రిని శనివారం డీసీసీబీ చైర్మన్ కలిసి ఆయా రైతులకు సంబంధించిన వివరాలను అందజేశారు. అలాగే రైతు రుణమాఫీలో డాటా మిస్ అయిన రైతులకు సంబంధించిన సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. దానిపై వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి త్వరగా రుణమాఫీ అయ్యేలా చూడాలని కోరారు. అలాగే ఉమ్మడి జిల్లాలో సహకార సంఘాలకు అధిక నిధులను కేటాయించాలన్నారు. డీసీసీబీలు, పీఏసీఎస్‌లను బలోపేతం చేసేందుకు సిబ్బందిని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

11 ఏళ్ల తరువాత బదిలీలు

- మోడల్ స్కూళ్లలో ముగిసిన ఉపాధ్యాయుల బదిలీలు
- ఉమ్మడి జిల్లాలో 560 మందికి స్థానచలనం.. విధుల్లో చేరిక

సూర్యాపేటటౌన్: మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కల నెరవేరింది. ఉద్యోగాల్లో చేరిన 11 ఏళ్ల తరువాత ప్రభుత్వం వారిని బదిలీ చేసింది. బదిలీ అయిన ఉపాధ్యాయులంతా శనివారం ఉదయం వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 33 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో సూర్యాపేట జిల్లాలో ఉన్న తొమ్మిది మోడల్ స్కూళ్లలో 144 మంది, యాదాద్రి భువనగిరిలోని ఏడు మోడల్ స్కూళ్లలో 126 మంది, నల్లగొండలోని 17 మోడల్ స్కూళ్లలో 290 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరంతా 2013లో విధుల్లో చేరారు. నాటి నుంచి బదిలీలు లేవు. మిగతా ఉద్యోగుల మాదిరిగానే తమను కూడా బదిలీ చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నారు. గత ఏడాది విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేయగా ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లు కూడా నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలోనే సీనియార్టీ, సర్వీస్ పాయింట్లపై కొందరు హైకోర్టుకు వెళ్లారు.కోర్టు స్టే ఇవ్వడంతో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. కాగా న్యాయపరమైన అవాంతరాలు తొలగిపోవడంతో బదిలీలు చేపట్టవచ్చని ఇటీవల హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ బదిలీల ప్రక్రియ చేపట్టి శుక్రవారం పూర్తి చేసింది.

పదోన్నతులు కూడా కల్పించాలి

మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు 11 సంవత్సరాల నుంచి బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టలకేలకు బదిలీలు కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఉపాధ్యాయులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతులు కూడా కల్పించాలి.

– భూతం యాకమల్లు, మోడల్ స్కూల్స్ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సత్తయ్య (ఫైల్)

వలిగొండ: ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో కలత చెంది గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన రూపని సత్తయ్య(58) మోత్కూరులోని శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ వద్ద అప్పు తీసుకొని హార్వెస్టర్ కొనుగోలు చేశాడు. కొంతకాలంగా కిస్తీలు సరిగ్గా చెల్లించకపోవడంతో శ్రీరామ్ ఫైనాన్స్ వారు హార్వెస్టర్‌ను తీసుకెళ్లారు. శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో కలత చెందిన సత్తయ్య గురువారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదారాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడేనికి చెందిన బైరం వెంకన్న(23) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం చౌటుప్పల్‌లో తన స్నేహితుల వద్దకు బైక్‌పై వెళ్లాడు. అక్కడ గణేష్ శోభాయాత్రలో పాల్గొన్నాడు. నిమజ్జనం ముగించుకొని అర్ధరాత్రి దాటాక బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. వలిగొండ చౌరస్తా వద్ద చిట్యాల వైపు నుంచి వస్తున్న మహీంద్రా కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

వినాయక మండపం వద్ద విద్యుదాఘాతంతో యువకుడు మృతి


గోవర్ధన్ (ఫైల్)

చింతపల్లి: వినాయక మండపం వద్ద విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన శనివారం చింతపల్లి మండలం కిష్టరాయనపల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టరాయనపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్(21) గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. శనివారం గణేష్ మండపం వద్ద లైట్ల కోసం తీసిన విద్యుత్ వైరు మండం వద్ద కర్రకు తాకడంతో అక్కడే ఉన్న గోవర్ధన్ విద్యుదాఘాతానికి గురై అపస్మారస్థితిలోకి వెళ్లిపోయాడు. గోవర్ధన్ స్నేహితులు వెంటనే అతడిని మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.


సూర్యాపేట : క్రికెట్‌లో మెళకువలు నేర్పిస్తున్న కోచ్


సూర్యాపేటలోని ఎస్వీ అకాడమీలో రాత్రివేళ ఫ్లడ్ లైట్ల వెలుతురులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

పేమెంట్ ప్లేగ్రౌండ్స్

సండే స్పెషల్

పట్టణాల్లో విస్తరిస్తున్న ప్రైవేట్ ఆట స్థలాలు

- రూ.లక్షలు వెచ్చించి అన్ని హంగులతో నిర్మాణం
- రాత్రివేళ సైతం ఆడుకునేలా ఫ్లడ్ లైట్ల ఏర్పాటు
- క్రీడాకారులకు చక్కని వేదికగా నిలుస్తున్న ఇండోటర్ఫ్ కోర్టులు
- వినూత్న ఆలోచనతో ఉపాధి పొందుతున్న యువత

ఒకప్పుడు ఏదైనా ఆట ఆడాలంటే.. నలుగురు కలిసి ఆ ఊరి చివరన ఉన్న ఖాళీ స్థలాల్లో పొద్దంతా ఆడుకునేవారు. ఇప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ఖాళీ స్థలాలే ఉండడం లేదు. పట్టణాలు విస్తరించడంతో ఎక్కడా ఖాళీ స్థలం కనిపించడం లేదు. దీంతో ఆటలపై ఆసక్తి ఉన్నా.. పెద్దగా స్థలం, సౌకర్యాలు లేకపోవడంతో గల్లీలోనే ఆటలు ఆడుకుంటున్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా పట్టణాల్లో ప్రైవేట్ ప్లే గ్రౌండ్స్ ఏర్పాటవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో కొంత మంది సొంతంగా క్రీడా స్టేడియాలు ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుండడంతో చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఆటలను ఆస్వాదిస్తున్నారు.

– మిర్యాలగూడ, రామగిరి(నల్లగొండ), సూర్యాపేట టౌన్, భువనగిరి టౌన్

ఆటలంటే అందరికీ ఆసక్తి. మానసిక ఒత్తిడి నుంచి బయట పడేందుకు ఆటలు ఎంతో దోహదం చేస్తాయి. ప్రభుత క్రీడా మైదానాలు ఉన్నా.. సౌకర్యాలు ఉండడం లేదు. దీంతో ప్రజలు, క్రీడాకారుల అభిరుచికి అనుగుణంగా.. ఇప్పుడు పట్టణాల్లో ఇండోటర్ఫ్ కోర్టులు(బాక్స్ క్రికెట్ గ్రౌండ్స్) వెలుస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు నగరాల్లో కనిపించే ఈ ఇండోటర్ఫ్ కోర్టులు ఇప్పుడు పట్టణాలకు వచ్చేశాయి. తక్కువ స్థలంలో అన్ని వైపులా గ్రీన్ నెట్‌తో ఈ కోర్టులు వెలుస్తున్నాయి. కొన్నిచోట్ల ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు కూడా ఏర్పాటయ్యాయి. ఫ్లడ్‌లైట్ల సదుపాయాలతో అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ ఆడేందుకు అద్దె వసూలు చేస్తుంటారు. క్రీడల్లో శిక్షణ సైతం ఇస్తున్నారు.

పెరుగుతున్న ఆదరణ

ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రిళ్లు ఆడే సౌలభ్యంతోపాటు శారీరకంగా పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేని రీతిలోనే నిబంధనలు ఉన్నాయి. చిన్న గ్రౌండ్ కావడంతో బంతి కోసం ఎక్కువ దూరం పరిగెత్తాల్సిన అవసరం ఉండదు. టీముల్లోనూ ఆరుగురు ఆటగాళ్లే ఉంటారు. గరిష్టంగా పది ఓవర్లే ఆడడంతో గంటలోపే మ్యాచ్ అయిపోతుంది. పరిగెత్తి బౌలింగ్ చేయాల్సిన పని లేదు. నిలబడి అలా విసిరినా చాలు, కొన్ని చోట్ల బౌలింగ్ మిషన్లు కూడా ఉంటాయి. ఇక, టెన్నిస్ బంతులనే వాడుతారు కాబట్టి గాయాల సమస్యా ఉండదు. నెట్ లోపల పూర్తిగా కృత్రిమ గడ్డిని ఏర్పాటు చేయడం వల్ల దుమ్ము సమస్యా ఉండదు. ఇక, వాష్‌రూమ్స్, డ్రెస్ చేంజింగ్ రూమ్స్ కూడా ఉంటాయి. కొన్ని చోట్ల ఫుడ్ కోర్టులు, డ్రింక్స్, స్నాక్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇన్ని సౌలభ్యాలు ఉండడంతో బాక్స్ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతోంది.

గంటల వారీగా ఫీజు..

బాక్స్ క్రికెట్ గ్రౌండ్స్‌లో ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు ఇక్కడ క్రికెట్ ఆడుతుంటారు. ఇందులో బాల్ ఎదురుగా ఉన్న నెట్‌కు నేరుగా వెళ్లి తాకితే సిక్స్, స్టెప్పలు పడుతూ వెళ్లి తాకితే ఫోర్, పైకప్పుకు తగిలితే అవుట్ లాంటి నిబంధనలు ఉంటాయి. సింగిల్స్, డబుల్స్, రనౌట్లు, క్యాచ్‌లు అన్నీ సాధారణ క్రికెట్ లాగే ఉంటాయి. గ్రౌండ్ విస్తీర్ణాన్ని బట్టి కొన్ని చోట్ల గంటకు రూ.400 నుంచి రూ.600 వరకు, కొన్ని చోట్ల ఓవర్లను బట్టి ఫీజు వసూలు చేస్తున్నారు. ఇక్కడ బాక్స్ క్రికెట్‌తో పాటు షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్ ఆడేందుకు కూడా అవకాశం ఉంటుంది. అంతే కాదు ఇక్కడ నిపుణులైన కోచ్‌లచేత శిక్షణ కూడా ఇస్తున్నారు.

బాక్స్ క్రికెట్ గ్రౌండ్ ఇలా..

ఖాళీ స్థలాన్ని బట్టి 30 నుంచి 40 మీటర్ల వరకు పొడవు, 30 నుంచి 35 మీటర్ల వెడల్పు విస్తీర్ణం, 20 మీటర్ల ఎత్తులో చుట్టూ పోల్స్ ఏర్పాటు చేసి వాటికి అన్ని వైపులా గట్టి నెట్ అమర్చుతారు. ఆయా ప్రాంతంలో ఉన్న స్థలాన్ని బట్టి ఈ విస్తీర్ణం మారుతుంది. రాత్రి వేళల్లో ఆడేందుకు వీలుగా ఎత్తులో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బాక్స్ క్రికెట్ కోర్టుకు రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఇవి నల్లగొండ పట్టణంలో దేవరకొండ రోడ్డు హరిత హోటల్ సమీపంలో, హైదారాబాద్ రోడ్డులో, భువనగిరిలోని నల్లగొండ రోడ్డు, జగదేవ్‌పూర్ రోడ్డు, మిర్యాలగూడలోని హౌజింగ్ బోర్డులో, సూర్యాపేటలోని ఎస్వీ కళాశాల మైదానంలో వీటిని ఏర్పాటు చేశారు.


భువనగిరిలోని బాక్స్ క్రికెట్ గ్రౌండ్


మిర్యాలగూడ క్లియో స్పోర్ట్స్ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

మిర్యాలగూడలో క్లియో స్పోర్ట్స్

మిర్యాలగూడలో హౌజింగ్‌బోర్డులో ఐదున్నర ఎకరాల్లో క్లియో స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో బాక్స్ క్రికెట్‌తోపాటు 400 చదరపు మీటర్ల విశాలం కలిగిన పెద్ద క్రికెట్ మైదానాన్ని కూడా ఏర్పాటు చేశారు. పచ్చని గడ్డిని అమర్చి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ అన్ని ఆటలు ఆడుకునేందుకు అవకాశం ఉంది. ఈ మైదానంలో క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ వంటి పోటీలకు శిక్షణ ఇస్తుంటారు. ఇక్కడి ఇండోర్ స్టేడియంలో నాలుగు కోర్టులు ఏర్పాటు చేశారు. ఇందులో గంటకు రూ.300 చొప్పున ఫీజు వసూలు చేస్తుంటారు. శిక్షణ తీసుకునే వారికి అడ్మిషన్ ఫీజు రూ.1000, నెలకు రూ.2వేల చొప్పున తీసుకుంటుండగా రోజుకు రెండు గంటలు శిక్షణ ఇస్తుంటారు. ఇక దేశీయ ఆటగా పేరొందిన కబడ్డీ శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇందుకు నెలకు రూ.1000 చొప్పున ఫీజు తీసుకుంటారు. పేద బాలబాలికలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణకు చక్కని అవకాశం..

శిక్షణ ఇవ్వడానికి బాక్స్ గ్రౌండ్ చక్కని ప్రదేశం. మైదానాల్లో నేర్పించాలంటే ప్లేయర్స్ ఎక్కువగా ఉండాలి, చాలా సమయం పడుతుంది. బాక్స్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేయడానికి అనువుగా ఉంటుంది. ఇక్కడ ఎక్కువ మందికి నేర్పించవచ్చు. ప్లేయర్స్‌ను గమనించడానికి వీలవుతుంది. వేసవి సమయంలో ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తాం. రెగ్యులర్‌గా కూడా కొంత మంది శిక్షణ తీసుకుంటారు. – ఎండీ. నజీబ్, క్రికెట్ కోచ్, నల్లగొండ

హైదరాబాద్‌లో చూశా..



గ్రేటర్ హైదరాబాద్‌లో బాక్స్ క్రికెట్ మైదానానికి ఆదరణగా పెరిగిపోయింది. అక్కడ చూసిన నేను మూడు నెలల క్రితం భువనగిరిలో బాక్స్ క్రికెట్ మైదానాన్ని ప్రారంభించా. ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. యువత, చిన్నారులు, ఉద్యోగస్తులు క్రికెట్‌తో పాటు ఇతర ఆటలు అడుకుంటున్నారు.

– మహ్మద్ మునాజిర్, ఎస్ఎస్ బాక్స్ క్రికెట్ గ్రౌండ్ నిర్వాహకుడు, భువనగిరి

క్రీడా అకాడమీల ఏర్పాటు..


సూర్యాపేటలోని ఎస్వీ ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో క్రీడా అకాడమీలు ఏర్పాటయ్యాయి. పట్టణంలో ప్రభుత్వ క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రైవేట్ క్రీడా అకాడమీలకు డిమాండ్ పెరిగింది. అనేక మంది యువకులు, క్రీడాకారులు అకాడమీలను ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తున్నారు. వాటికి ఆదరణ ఎక్కువగా ఉండటంతో అనేక మంది ఈ రంగం వైపు మొగ్గు చూపుతున్నారు. తాము ఉపాధి పొందడంతోపాటు చాలా మంది క్రీడాకారులను తయారు చేస్తున్నామన్న సంతృప్తి పొందుతున్నారు. ఇలా ఎస్వీ డిగ్రీ కళాశాలలో మైదానాన్ని అద్దెకు తీసుకొని అందులో నెట్ ప్రాక్టీస్ చేయిస్తూ క్రికెట్ కోచింగ్ ఇస్తున్నారు. అలాగే ఇదే కళాశాలలో మరో చోట బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. అలాగే కుడకుడ రోడ్డులో మరో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేశారు.

రెండేళ్లుగా క్రికెట్ శిక్షణకు పంపిస్తున్నా



మా కుమారుడు కార్తిక్ 6వ తరగతి చదువుతున్నాడు. బాబుకు క్రికెట్ అంటే ఇష్టమని తెలుసుకుని రెండేళ్లుగా శిక్షణకు పంపిస్తున్నా. రోజూ ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు శిక్షణ ఇస్తున్నారు. దీని వల్ల ఎంతో చురుగ్గా, ఆరోగ్యంగా ఉంటున్నాడు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరం.

– సైదులు, సూర్యాపేట

బ్యాడ్మింటన్‌కు మంచి ఆదరణ



బ్యాడ్మింటన్‌కు ఆదరణ పెరిగింది. వయో వృద్ధులు సైతం ఈ ఆటపై ఆసక్తి చూపుతున్నారు. నేను నేషనల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిని కావడంతో ఆటపై పూర్తి పట్టు ఉంది. నేను చాల మందికి కోచింగ్ ఇస్తున్నాను. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచింగ్ ట్రెనింగ్ ఔరంగాబాద్‌లో నేషనల్ టీంకు రెండు సార్లు కోచ్‌గా వ్యవహరించాను.

– ఎం.రామకృష్ణ, బ్యాడ్మింటన్ కోచ్, మిర్యాలగూడ



మిర్యాలగూడలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


నల్లగొండలోని దేవరకొండ రోడ్‌లో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్


మిర్యాలగూడలో క్లియో స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

పగటిపూట రెక్కీ.. రాత్రివేళ చోరీ


స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్ ట్రాలీలను చూపుతున్న ఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

- ట్రాక్టర్ ట్రాలీలు దొంగతనం చేస్తున్న నలుగురి అరెస్ట్
- 19 ట్రాక్టర్ల ట్రాలీలు, ఒక బైక్, ఒక ట్రాక్టర్ ఇంజన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్: ట్రాక్టర్ ట్రాలీలు చోరీ చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత ఎస్పీ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా అనుముల మండలం మారెపల్లి గ్రామానికి చెందిన సంపంగి మహేష్, ఆలకుంట్ల మహేష్, నకిరేకల్ మండలం గోరెంకలపల్లి గ్రామానికి చెందిన సంపంగి సత్యం, కనగల్ మండలం చర్లగౌరారం గ్రామానికి చెందిన ఓర్సు వెంకన్న కలిసి పగటిపూట గ్రామాలల్లో రైతుల పొలాల వద్ద, రోడ్ల వెంట రెక్కీ నిర్వహించి రైతుల టాక్టర్ ట్రాలీను రాత్రివేళ చోరీలు చేస్తున్నారు. ఇలా దొంగలించిన టాక్టర్ ట్రాలీలను తక్కువ ధరకు ఇతర రైతులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిపై సూర్యాపేట జిల్లాలోని మునగాల, పెన్‌పహాడ్, నాగారం, మద్దిరాల, నూతనకల్, మోతె, గరిడేపల్లి, సూర్యాపేట రూరల్, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ రూరల్, గుర్రంపోడు, శాలిగౌరారం, కేతేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 19 కేసులున్నాయి. ఈ నెల 13వ తేదీన మద్దిరాల ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి మద్దిరాల ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా.. కుంటపల్లి గ్రామం వైపు నుంచి సంపంగి మహేష్, సంపంగి సత్యం, ఆలకుంట్ల మహేష్, ఓర్సు వెంకన్న బైక్‌పై, స్వరాజ్ ట్రాక్టర్ ఇంజన్‌పై వస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ట్రాక్టర్ ట్రాలీలు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 19 ట్రాక్టర్ ట్రాలీలు, ఒక ట్రాక్టర్ ఇంజన్, బైక్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్ ట్రక్కుల విలువ రూ.22.92లక్షలు ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. సంపంగి మహేష్, సంపంగి సత్యంపై మరో 12 కేసులు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, తుంగతుర్తి సీఐ శ్రీను, సీసీఎస్ ఎస్‌ఐ శ్రీకాంత్, మద్దిరాల ఎస్‌ఐ వీరన్న, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు. సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ జనార్దన్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ రవి పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన అంబులెన్స్

- అంబులెన్స్ డ్రైవర్ మృతి
- మరో ముగ్గురికి గాయాలు


రాకేష్ (ఫైల్)


సుజ్జునుజ్జయిన అంబులెన్స్

మిర్యాలగూడ టౌన్: రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ మృతిచెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ శివారులో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఏఎస్‌ఐ రాములునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నిజాంపేటకు చెందిన సునీత కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో నివాసముంటున్న తన బంధువు సుబ్బమ్మ ఇంటికి వెళ్లింది. శుక్రవారం సునీత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నెల్లూరు పట్టణానికి చెందిన ప్రైవేట్ అంబులెన్స్‌లో బంధువులు ఆమెను హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారు. మార్గమధ్యలో అర్ధరాత్రి సమయంలో మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ శివారులో భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి పక్కన మరమ్మతుకు గురై ఆగిన టిప్పర్‌ను అంబులెన్స్ డ్రైవర్ రాకేష్(24) వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాకేష్ అంబులెన్స్ క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. సునీతతో పాటు ఆమె బంధువు సుబ్బమ్మ, కేర్ టేకర్ శివకుమార్, టెక్నీషియన్ సునీల్‌కుమార్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మరో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. అంబులెన్స్ డ్రైవర్ మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ మనుపాషపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాములునాయక్ తెలిపారు. మృతుడికి భార్య యశస్విని ఉన్నారు. ప్రధాన రోడ్లపై వాహనాలు మరమ్మతులకు గురైతే ముందుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి సూచిక బోర్డులు లేకుండా వాహనాలను రోడ్లపై నిలిపి రిపేర్లు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ వీరబాబు హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


చినస్వాములు

భువనగిరి క్రైం: లారీ డ్రైవర్ అదృశ్యమైనట్లు శనివారం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో అతడి భార్య ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా పడిగాల మండలం మచ్చుమర్రి గ్రామానికి చెందిన అంబటి చినస్వాములు భువనగిరి మండలంలోని రాయగిరిలో నివాసముంటున్నాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న చినస్వాములు ఈ నెల 8వ తేదీన లారీపై డ్రైవింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. శనివారం అతడి భార్య మున్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వలిగొండ : విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామానికి చెందిన రైతు మాగ శ్రీను పాడి ఆవు శనివారం మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. మృతిచెందిన ఆవు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం తనకు ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చౌటుప్పల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడేనికి చెందిన జంపాల కిషన్ (63) దివీస్ పరిశ్రమలో పనిచేసే తన కుమారుడికి శనివారం ఉదయం లంచ్‌బాక్స్ ఇచ్చి తిరిగి ఆటోలో లింగోజిగూడెం గ్రామ స్టేజీ వద్దకు వచ్చాడు. అక్కడ హైవే దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో కిషన్ రెండుకాళ్లు విరిగాయి. అతడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

భువనగిరి రూరల్ : మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన నకిరెకంటి బాలయ్య తిమ్మాపురం నుంచి భువనగిరికి వెళ్తుండగా హన్మాపురం సమీపంలో సెల్‌ఫోన్ పడిపోయింది. దీంతో అతడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఐఎంఈఐ నంబర్ ఆధారంగా సెల్‌ఫోన్ ఆచూకీ కనిపెట్టి శనివారం బాధితుడికి అప్పజెప్పినట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.